# గంతోపు

## ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ

వెంకయ్యనాయుడు అరుగుమీద కొచ్చేసరికి చెదురు ముదురుగా కూర్చున్న రైతులు చిన్నా పెద్దా అంతా ఒక్కసారే లేచి నిలబడ్డారు. నాయుడు వాళ్ళకేసి చూడలేదు. తాళల్నాటి పడక కుర్చీలో చతికిల బడిపోయాడు. విరిగిన చెట్టులా కూలబడ్డాడు.

నాయుడిది ఆరడుగుల విగ్రహం. నించుంటే కొండ నిలబడ్డట్టు కూచుంటే కొండ కూచున్నట్టే ఉంటుంది. ఇత్తడి పళ్ళెం లాంటి విశాలమైన ముఖం. ఎర్రటి రాగి రంగులో ఉండే మీసాలు దుబ్బులా పెరిగిన కనుబొమ్మలు. వాటి కింద కరుణ, కోపం రెండూ తీవ్రంగానే చూపగల కళ్ళు. విశాలమైన నుదురు మీద నామం. మోచేతి దాకా ఉన్న ఖద్దరు చొక్కా కిందనో ముతక పంచె. భుజం మీదో కండువా చూడగానే నమస్కరించే విగ్రహం నాయుడిది.

నాయుడు కుర్చీలో చతికిల పడగానే ఒకళ్ళిద్దరు పెద్దరైతులు చేతిలో చుట్టల్ని కిందపారేసి అరికాలితో తొక్కి పారేశారు అది నాయుడంటే భయంకాదు. భక్తితోటే నాయుడికి చెడు అలవాట్లు అంటే తగినంత చికాకు.

నాయుడికి అరవై ఏళ్ళని ఎవరూ అనుకోలేరు. అలా ఉంటుంది అతని దేహం. అతని అలవాట్లు అలా ంటివే. మూడో గంట పంచాయితీలో కొట్టేరు, అంటే నాయుడు లేచి కాలకృత్యాలు తీర్చుకుని పొలానికి వెళ్ళిపోయాడే

వందెకరాల భూమి పదిమంది పాలికాపులు ఉన్నా అతను స్వయంగా దూడ శాలలో నిలబడి పేరు పేరునా దూడల్ని పరామర్శించి పాలు పితికించి రెండు బిందెల పాలు... పాలెకాపు తెస్తుంటే ముందునడిచి ఊళ్లో అడుగు పెట్టే వేళకి ఊరు నిద్రలేస్తోంది.

గంట వ్యాయామం చేసి ఒళ్ళు ఆరబెట్టుకుని అరెకరం నడ్డిని తోమి స్నానం చేసేసరికి సూర్యోదయం అయిపోతుంది. రాత్రి పెరుగులో పడేసిన తవ్విడు బియ్యం అన్నం కాస్త ఆవకాయతో నల్చుకుని అతగాడు సద్దివన్నం తిని అరుగెక్కే వేళకి పొలంలో ఏవేంపన్లు చేయాలో పురమాయింపులకు పాలెకాపులొచ్చి నిలబడుంటారు. అతగాడు పన్లు పురమాయించి వాళ్ళని సాగనంపి పడక కుర్చీలో కూర్చుని పేపర్ అందుకునేసరికి ఊళ్లో పెద్దా చిన్నా రైతులు అరుగుమీదకి చేరిపోతారు.

ఆ ఊళ్లో రాజకీయాలులేవు, గ్రూపులులేవు కక్షలులేవు. కార్పణ్యాలు లేవు. పంచాయితీ ఎలక్షన్ అంటే ఆ ఊరికి తెలియదు. పంచాయితీ అయినదగ్గర నుంచి నాయుడే పంచాయితీ ప్రెసిడెంట్... ఇప్పుడు సర్పంచ్ కొద్దిమంది పేర్లు మెంబర్లుగా ఉంటాయి. ఆ ఊళ్లో జనం కోర్టులు కెక్కరు, చిన్నా పెద్దా గొడవలన్నీ నాయుడిగారి లోగిల్లో పరిష్కారం అయిపోవల్సిందే.

గుళ్లో దేవుడు మేడలో నాయుడు ఒక్కడే వాళ్ళకి. అతని ప్రవర్తన నియమం. మర్యాదా మన్నన ప్రేమ అభిమానం అతనికి తెచ్చిపెట్టిన గౌరవం.

**నాయుడు.... చచ్చిపోయిన పులిలా అలాగే ఉండిపోయాడు. అతని నోరు పెగలలేదు....ఎర్రటి కళ్ళల్లోంచి నెత్తురు చుక్కలులా....కన్నీళ్లు జారుతుంటే మెల్లిగా లేచాడు. అప్పుడే స్వామినాయుడు వచ్చాడు.**

అలాంటి ఊళ్లో ముసలం పుట్టింది. ఊరంతా అల్లకల్లోలం అయిపోయింది. అట్టుడికిపోయింది. ముసలం ఎక్కడో పుట్టలేదు. నాయుడింట్లోనే పుట్టింది.

ముసలం పుట్టి మూడు రోజులే అయింది. యాదవ వంశ నాశనం ఇప్పుడు జరగబోతోంది. అందుకే నాయుడంత గంభీరంగా కూర్చున్నాడు.

ఊళ్ళో జనాలకి, మతి మతిలోలేదు. నాయుడింట్లో పుట్టిన కల్లోలంలా వాళ్ళు భావించటం లేదు. ఊళ్ళో పుట్టిన కల్లోలంగాను దేశంలో పుట్టిన కల్లోలంగా భావిస్తున్నారు వాళ్ళు అందుకే అంత కంగారు. పెద్దలంతా తలలొంచుకుని ఆలోచిస్తున్నారు. పిన్నలు నాయుడేం చెబుతాడో అన్నట్టు చూస్తున్నారు.

నాయుడింట్లో కల్లోలం నాయుడు పెద్ద కొడుకు రూపంలో పుట్టింది. నాయుడికి ఇద్దరు కొడుకులూ ముగ్గురు కూతుర్లు. ముగ్గురు కూతుర్లు కాపురాలకి చక్కాపోయారు. స్థితిమంతులే అల్లుళ్ళంతా. అంతా పక్క పక్క ఊళ్ళ వాళ్ళే...పిల్ల పాప ఉన్నవారే. ఇప్పుడొచ్చిన ఈ విపత్తు విని...పిల్లా...మేక వెంటేసుకుని చక్కా వచ్చేశారు.


ఇంటినిండా కూతుర్లు, అల్లుళ్ళు...మనవలు మనవరాళ్లు, కొడుకు...కోడళ్లు...అంతా చేరిపోయారు అంతా నాయుడికేసి చూసేవారే. అతను పెదవి విప్పి చెప్పే మాటకోసం ఎదురు చూసేవారే. అతని కుటుంబమే కాదు ఊరు ఊరంతా ఎదురు చూస్తున్నారు.

ఇంతమంది ఆలోచనలకు కేంద్రీభూతమైన స్వామినాయుడు మాత్రం అక్కడలేడు. అతనక్కడుంటే సమస్యేలేదు. సమస్య తెచ్చింది అతనే.. పరిష్కారమే అంతుపట్టటంలేదు.

ఏ సమస్యకైనా పరిష్కారం చెప్పగల నాయుడు...మౌనం వహించటం ప్రజలకాశ్చర్యంగా ఉంది. అతని అంతరంగంలో ఏముందో ఎవరికి అర్థంకావటంలేదు. అతని అర్ధాంగి ముత్తెలమ్మకే అర్థంకావటంలేదు. రాత్రల్లా నాయుడు ఆలోచిస్తునే ఉన్నాడు...విశాలమైన మంచం మీద పడుక్కుని పై కప్పుకేసి చూస్తూ బాదం కాయల్లాంటి గుడ్ల మీద రెప్పల్ని కూడా మూయకుండా నాయుడు ఆలోచిస్తుంటే పలకరించటానికి కూడా ఆమెకు ధైర్యం చాలటంలేదు. ఉదయానికి పరిస్థితే మారిపోయింది.

అయితే నాయుడు మోచేతులు తలవెనక పెట్టుకుని పడక కుర్చీలో శిలాప్రతిమలా కూచుంటే ఇప్పుడు పలకరించటానికి ఎవరికి ధైర్యం చాలక అలాగే కూచుండిపోయారు.

కామందులంతా శిలాప్రతిమల్లా కూచున్నారు. కరణం గోడకిచేరబడి... మునసబుకేసి చూసి నొసలు ఎగరేశాడు. మునసబు పెదవి విరిచేశాడు. మగాళ్లు...లోగిల్లో కాస్త ముందుగా కూర్చుంటే...ఆడాంగులు కాస్త వెనుకగా విశాలమైన లోగిల్లో స్తంభాలమాటున నిలబడ్డారు. గాలికూడా స్తంభించినట్టు ఉక్కపోతగా ఉంది. పన్నెండు గంటలవేళ ఊరూవాడా అన్నాలు తిని కాస్తంత నడ్డి వాల్చే వేళ నాయుడు లోగిల్లో నిలబడిపోయారు




సరిగ్గా అప్పుడొచ్చాడు. సులేమాన్...

జనం పిల్లా...మేకా... వణికిపోయారు ఏం జరగబోతోందో...వాళ్ళకి అర్థంకాలేదు.

సులేమాన్ ఈ పరిస్థితుల్లో ఇక్కడకు రావటమా? సులేమాన్ ఉరఫ్ సూరయ్య... నాయుడింటికి ఇంతమంది చుట్టూ ఉండగా రావటమా? ఏం జరగబోతోంది? అందరిలోనూ ఆతృత ఆందోళన భయం.

ఈ భయానికి కారణం మూడు రోజుల క్రితం సంఘటనే. ఆ ఊరికి ఉత్తరంగా... హరిజన వాడ ఉంది. చిన్నా పెద్దా అంతా కలిపి ఓ రెండు వందల మంది అక్కడుంటున్నారు. అందులో హెచ్చుమంది వ్యవసాయకూలీలే. వారికి రెక్క ఆడితేనే డొక్కాడుతుంది. దేశంలో నాయకులు హరిజనులు అని పేరు సృష్టించి వారినలా ఉంచారు. వారికి కొత్తకొత్త ఇళ్లు కట్టించినా ఊరి చివరే కట్టించారు. వాళ్ళకి కష్టాలు కలుగుతు ఉండాలి. వాటిని తొలగించటానికి నాయకులు ప్రయత్నం చేస్తు ఉండాలి - వారి మెప్పుదల పొందాలి. వారినలా మిగిలిన సవర్ణులుతో కలపకుండా వారిని సేవిస్తూ తరించాలి. ఈ విధంగా చాల ఏళ్ళగా జరిగిపోతూ వచ్చింది.

ఇందులో ఎవరి స్వార్థం వాళ్ళది. నిజంగా అంతా కల్సిపోతే అందరి ఆలోచనలు కలబోసుకుంటే నాయకుల బండారం బయటపడి నాయకుల దుమ్ము దులిపేస్తారనే భయం నాయకులదయితే...

ఎప్పటినించో అలాసాగుతో.ది. సాగనిద్దు... అనుకునేవారు కొందరు ఈ విధంగా విభజించి పాలించాలనే ఇంగ్లీషువాడి విత్తనాన్ని నీళ్లుపోసి పెద్ద చెట్టు చేసి పరిపాలన సాగిస్తూ వచ్చారు.

అయితే దేశం సంగతెలా ఉన్నా ఆ ఊరి హరిజనవాడలో అలాంటి అసంతృప్తి చోటు చేసుకోకుండా చూశాడు నాయుడు. అంతకు ముందు హరిజనవాడలో ఒకబడి ఊళ్ళో ఒక బడి నడిస్తే... అతను కాస్త పిల్లలకు దూరమైనా సరేనని రెంటికి మధ్యగా కట్టించి అటు వాడని, ఇటు ఊర్ని కలిపే ప్రయత్నం చేస్తు వచ్చాడు.

శ్రీరామ నవమి ఉత్సవాల్లో సైతం రథం హరిజనవాడ చుట్టి రావాల్సిందే. మొదట్లో కొందరు మూతులు తిప్పుకున్నా - మూలిగినా నాయుడు మాటకు ఎదురు చెప్పలేకపోయారు. అదో సంప్రదాయంగా సాగిపోతూవస్తోంది.

రెండేళ్ళక్రితం పాదరీలు హరిజనవాడలో ప్రవేశించి వాళ్ళ కష్ట నష్టాల్ని వాళ్ళకి గుర్తుచేసి మతం మారితే జరిగే ఉపకారాలేమిటో బోధ చేయడం జరిగింది. ఆవార్త గూడెం నించి హుటాహుటిని నాయుడింటికి చేరింది.

కరణం మునసబు నాయుడ్ని వాడకెళ్ళి వాళ్ళ నించి హరిజనవాడని కాపాడమని కంగారు పెట్టేశారు. నాయుడు చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. కరణం మరీ కంగారు పెట్టిడంతో నోటిప్పాడు నాయుడు.

"మతంలో కలియటం వల్ల మాలలకు కాని మాదిగలకుకాని వచ్చే కొత్త పరపతి ఏంలేదు పంతులూ! కాకుంటే పాలపిండులు పంచి పెడతారు. గూడెంలో ఓ స్కూలు పెడతారు. సదివిస్తారు. చర్చికి తిప్పుతారు. అంతేకాని ఆళ్ళకి బువ్వ ఎట్టగలరా? ఏం సదువుకున్న మగోళ్ళు పాలెకాపులుగాను ఆడాళ్ళు గడ్డికోయటానికి రాక తప్పదుగా? పేరు మారచ్చు. మతం మారదు. ఆళ్ళ బతుకులు మారవయ్యా? మాదిగలయిన కిరస్తానిలయినా రెక్కాడితేనే డొక్కాడుంది. మిషనరీలైన-మతం మారుస్తారేమోకాని తమతో చుట్టరికం ఇస్తారా సంహపంక్తి ఇస్తారా? వాళ్ళకి సదువు సెప్పించి ఉద్యోగాలిస్తారా? అసలు మనిషి మనిషిని దూరంచేసేది కులం కాదయ్యా. డబ్బు. ఉన్నోడు లేనోడు. రెండే కులాలు. ఉన్నోడి కులం పెద్ద కులం. లేనోడి కులం చిన్న కులం. అంటే ఈ ఉన్నోడు లేనోడు కల్సిపోతే అసలు కులాలే ఉండవు" నిబ్బరంగా కూర్చుండిపోయాడు నాయుడు.

వారంరోజులు గూడెంలో మకాంచేసి, ఎంత ప్రయత్నించినా ఎవరికి మతం ఇప్పించలేకపోయారు. వాళ్లు వెళ్ళే ముందు నాయుడు దగ్గరికి వచ్చేరు.

"ఊళ్ళో అంతా మీ పేరు చెప్తున్నారు మిమ్మల్ని చూద్దామనివచ్చేం" అన్నాడు దొర.

"సంతోషం" అంటూ నాయుడు బొండాలు దింపించి ఆతిథ్యమిచ్చాడు.

"మీరు కులమత భేదాలు పాటించరని విన్నాం మరి మీ ఆడపిల్లల్లో ఎవర్ని మరో కులంలో ఎందుకివ్వలేదు..." దొర సూటిగా అడిగేడు.

నాయుడు చిరునవ్వు నవ్వేడు. సమాధానం ఇవ్వలేదు.

"అంటే మీకూ కులపట్టింపులు ఉన్నాయన్న మాట" దొర అక్కసుగానే అన్నాడు. బొండం గ్లాసులో వంచుకుంటూ...

నాయుడు మాట్లాడలేదు బొండం ఎత్తి గటగటా తాగి కొబ్బరి బొండం పక్కనపెట్టి.

"చూడండి. మీరు బొండంలో నీరు గ్లాసులో ఒంపుకుని తాగేవారు మేము అలా ఎత్తుకుని తాగే వాళ్ళం. మనం ఇద్దరం వియ్యం పొందేమనుకోండి. మీ బిడ్డకి ఆ అలవాటు...నా బిడ్డకి ఈ అలవాటు సంస్కారాలు. అలవాట్లు అన్నీ భిన్నమే. అనుక్షణం ఇద్దరికి నరకమే. నా బిడ్డల్ని నరకంలోకి తోయటం ఇష్టం లేక అన్ని విధాలా నాకు సరిజోడైనచోట నా బిడ్డల్ని ఇవ్వటం జరిగింది అంతేకాని...మీరనే కులపట్టింపులు కావు వియ్యమైనా కయ్యమైనా సమఉజ్జిలో జరగాలి.

దొర ఇక మాట్లాడలేదు.

ఆ రకంగా ఆ ఊళ్ళో మరో మతంచోటుచేసుకోకుండాపోయింది

అలాంటిది మూడురోజులనాడు పెద్ద సంఘటనే జరిగిపోయింది. నాయుడు పెద్ద కొడుకు స్వామినాయుడు సలీం సాహెబ్ అయిపోయాడు. ఊరు ఊరంతా అట్టుడికిపోయింది. స్వామి నాయుడు సలీం సాహెబ్ అయిపోవటం కాదు అతనితోపాటు తొలి విడతగా ముగ్గురు హరిజన యువకులు ముస్లిం మతంలోకి మారిపోయారు.

మతం మారటమే తరవాయి. ఆ రాత్రి సలీం సాహెబ్‌గా మారిన స్వామినాయుడు. మరో బీబిని వివాహంకూడా చేసుకున్నాడు.

కేవలం భార్య బతికుండగానె మరో పెళ్ళి చేసుకుందికి మతం మారేడని కొందరన్నారు. అది కాదు డాలర్ల కాశించి మారేడని కొందరన్నారు. అదీ ఇదీ కాదు. ముస్లిం మతంమీద విశ్వాసంతో మారేడని కొందరన్నారు. ఏదైనా మతం మారటం మాత్రం నిజం.




## హుషారు

ఆరోజే విడుదలైన సినిమా మాట్నీ చూసొచ్చి కూని రాగాలు తీస్తూ హుషారుగా వున్నాడు శంకర్.

"ఏవిట్రా అబ్బాయ్! చాలా హుషారు వున్నావు ఏమిటి కథ?" అడిగాడు వాళ్ళ తాతయ్య.

"అబ్బే..... కథేం లేదు... అన్నీ పాటలే..." అన్నాడు ఇంకా సినిమా ధ్యాసలోనే వున్న శంకర్.

—దేవరాజు (కువైట్)



నిజం నిప్పులా ఊర్ని చుట్టబెట్టింది పట్నంలో జరిగిన ఈ కార్యక్రమాలేవి తెలియని నాయుడు. తెల్సి తెల్లబోయాడు.

మూడు రోజులుగా ఏం జరుగుతోందో ఎవరికి అంతు పట్టకపోయినా ఆ రోజు సలీం సాహెబ్‌గా మారిన స్వామినాయుడు ఊళ్లోకి వచ్చేడని గంటకో గడియకో ఇంటికొస్తాడని తెల్సిపోయింది. నిజానికది నాయుడింటి వ్యవహారం అయితే ఆ ఊళ్లో ఎవరింటి వ్యవహారమైన ఊరిదే. అందుకే ఊరంతా అక్కడే ఉంది.

సరిగ్గా అప్పుడే సులేమాన్ ఉరఫ్ సూరయ్యా అక్కడికొచ్చాడు. స్వామి నాయుడితోపాటు మతం మారిన హరిజన యువకుల్లో అతనొకడు.

అతనా అరుగు దగ్గరకురాగానే ఆగ్రహావేశాలతో కొందరులేచారు. వాళ్ళు లేవటం గమనించిన సులేమాన్ ఒకడుగు వెనక్కివేశాడు అతనొక గళ్ళ లుంగీ కట్టుకున్నాడు. పైన లాల్చీ వేసుకున్నాడు. జనం అడుగు ముందుకేయగానే అతనో అడుగు వెనక్కి వేశాడు. తటపటాయిస్తు నిలబడ్డాడు.

నాయుడప్పుడే చూశాడు. అతని తటపటాయింపు గమనించి ... "రా ... సూరయ్యా! ...రా..." అన్నాడు.

"ఆయ్!...అలాగేనండి...నాపేరు సూరయ్యా కాదండి సులేమాన్" కొంచెం తెగిరినా బింకంగానే చెప్పాక. నాయుడు నిస్తేజంగా నవ్వేడు. ఆ నవ్వులో ఏ భావంలేదు.

"మారింది నీ వేషం అంతేనయ్యా!సూరయ్యా అనగానే. ఆయ్...అంది...నీ నోరు...నీ పంచేంద్రియాలు మారలేదు. ఆకారం మారలేదు. రంగు మారలేదు. నీ సంస్కారం మారలేదు...నడక మారలేదు...మాట తీరు మారలేదు. సర్లే...రా కూర్చో...." అన్నాడు కుర్చీ చూపి నాయుడు.

విస్మయంగా చూసి "ఫర్లేదండి. మీతో ఓ మాట చెప్పాలని వచ్చేనండి" నిలబడే అన్నాడు సులేమాన్.

"అలాగే చెబుదువుగాని కూర్చో"

"అక్కర్లేదండి. మాట ఇనండి చాలు" అన్నాడతను.

అంతా తెల్లబోయి నాయుడి సహనాన్ని ఆశ్చర్యంతో చూస్తు ఉండిపోయారు. నాయుడు ఉగ్రరూపంతో విరుచుకుని పడిపోతాడని ఊహించిన వాళ్ళు నిరుత్సాహపడిపోయారు.

"హరిజనుడిగా...నీకెప్పుడు కుర్చీ ఇవ్వక పోవచ్చు. సులేమాన్ సాహెబుగా...నీకు కుర్చీ చూపించేనుగా కుర్చో" నాయుడు మరోసారి శాంతంగానే అన్నాడు.

సూరయ్యా బెదురు చూపులుచూస్తు నాయుడ్ని, మిగిలిన జనాన్నిచూస్తు నిలబడిపోయాడు.

"చూడు సూరయ్యా! నీకా కుర్చీలో కూర్చునే ధైర్యాం కల్గించలేనిది...నీ కులం...మతంకాదు. నీ ఆర్థికస్థితి మూడు రోజుల క్రితం...వచ్చిన హరిజన కలక్టర్ అదే కుర్చీలో. ఠీవిగా కూర్చున్నాడు. ఎన్నికల ముందొచ్చిన హరిజన నాయకుడు అదే కుర్చీలో కూర్చున్నాడు. వాళ్ళనా కుర్చీలో కూర్చునపెట్టింది ఆర్థికస్థితి...స్తోమత. ఆర్థికంగా నువ్వూ...నేనూ...సమానమైతే మనమంతా ఒకే చోటే కూర్చుంటాం. మనం ప్రయత్నం చేస్తున్నది. చేయాల్సింది దానికి... నీ మతం...నీకో కుచ్చు టోపి తేగలదేమో కాని మరే రకమైన మార్పు నీలో తేలేదు. నేనేమతాన్ని అవమానించటానికి ఈ మాట అనటంలేదు. అన్ని మతాలుగొప్పవే...అన్న దేవుడ్ని చేరటానికి దారులే...నువ్వేదార్ని దేముడ్ని చేరినా...నాకభ్యంతరంలేమ...ఈ దేశంలో ఎవరేమతాన్ని ఆచరించటానికైనా హక్కుంది. ఎవరికిష్టమైన మతంలోకి వాళ్ళు మారనూవచ్చు. చెప్పు. ఏం చెప్పదల్చుకొన్నావో చెప్పు" మెల్లిగానైనా అతి గంభీరంగా అన్నాడు నాయుడు.

సూరయ్యా నాయుడి మాటలతో కంగు తిన్నట్టు. కొద్దిసేపు మాట్లాడలేదు. చివరికి నీళ్ళు మింగుతు మెల్లిగా అన్నాడు "చెరువు కట్ట కింద మీ పెద్దబ్బాయిగారి పొలంలోమశీదుకడతారటండి. ఆ పొలం...ఇస్మాయిల్‌సాహెబ్‌కి అబ్బాయిగారు అగ్రిమెంట్ చేశారండి. ఇల్లిదిగో ఇక్కడ మీరు సంతకం పెడితే ఆళ్ళుపునాదులు తీసుకుంటారుటండి" లాల్చీజేబులోంచి కాగితంతీశాడు సూరయ్యా.

అంతే. జనం మూకుమ్మడిగా లేచిపోయారు అరుస్తు. అంతా ఒక్కసారి సూరయ్యామీద పడిపోయారు.

"నాయుడిగారి పొలంలో మశీదు కడతారా?"

అరుపులు కేకలు చుట్టుముట్టేయి.

ఈ పరిస్థితి ముందే ఊహించినట్టున్నారు మరి కొంతమంది ముస్లిం యువకులు. ఆ వీధి చివర్న నిలబడ్డ వారు రంగంలోకి దిగిపోయారు.

క్షణంలో అక్కడ వాతావరణం మారిపోయింది. తన్నులాటలు గుద్దులాటలు...అరుపులు కేకలు...ఆడవాళ్ళ పరుగులు...పిల్లల కేకలు ఏడుపులు.

నాయుడు...చచ్చిపోయిన పులిలా అలాగే ఉండిపోయాడు. అతని నోరు పెగలలేదు... ఎర్రటి కళ్ళల్లోంచి నెత్తురు చుక్కలులా...కన్నీళ్లు జారుతుంటే మెల్లిగా లేచాడు. అప్పుడే సలీం ఉరఫ్ స్వామినాయుడు వచ్చాడు.

"ఒరేయి ఆగండ్రా" ఒక్కటే అరుపు అరిచేడు నాయుడు.



ఎవరు ?

"మీ సినిమాలో ఆ బిచ్చగాడి పాత్ర వేసిందెవరండి! చాలా సహజంగా నటించాడు, కొత్తవాడా?" అడిగాడు విలేకరి దర్శకుడు దామోదరాన్ని.

"నటనకు కొత్త వాడేలెండి, నేను దర్శకత్వం వహించిన మొదటి చిత్రానికి నిర్మాత" చెప్పాడు దామోదరం.

—వి. శివరామకృష్ణ (ఒంగోలు)



ఆ కంఠానికి...పిడుగుపడినట్టు ఆ అరుపుకి అంతా శిలా ప్రతిమల్లా నిలబడిపోయే రొకి క్షణం. తంద్రి కంఠంతో స్వామినాయుడు నోరెత్తలేదు.

"దేనికిరా...కొట్టుకుంటున్నారు. ఎవర్ని... ఎవరురా హింసిస్తున్నారు. ఎందుకూ? ఎందుకీ కొట్లాటలు కేవలం మనిషిని దైవత్వంకి మర లించేది మతం అలాంటిది...మానవత్వం మర్చి కొట్లాడుకుంటున్నారు దానవత్వంలోకి జారి పోతున్నారు.

ఈ మతాంతరీకరణలు జాతి ఐక్యతకే అత్యంత ప్రమాదం తెస్తున్నాయి. భారతదేశంలో అను క్షణం మత కల్లోలాలు రెచ్చగొడుతున్నాయి. ఎవరిమతం వారు ఆదరించండి. పరమతాల్ని గౌరవించ్రడా! ఈ మతం మార్పిడిలు అనర్థాల్ని తెస్తున్నాయి. మన పూజ్య బాపూజీ... ఈ మంతాతరీకరణంమీద ఏమన్నాడో తెలుసా?

"నాకే అధికారం ఉండి ఉంటే చట్టం చేయ గలిగితే తప్పకుండా మతం మార్పిడిల్ని నిషేధిస్తా నని ఆయనే స్వయంగా హరిజన్ పత్రికలో రాశాడు.

కొట్టుకు చావకండి. ఆగండి అతి కొద్దిమంది మతం మార్పిడి ఈ ఊళ్ళో ఈకల్లోలం లేవగొడితే ఇక దేశం మొత్తంమీద ఎన్ని కల్లోలాలకు కారణం అవుతున్నాయో ఆలోచించండి.

మీరనే మతంలో మాత్రం... జులహా... దర్జీ. నాయ్... కుంజా... భరహాయి... ఇలా రకరకాల వృత్తులుచేసే జాతులు లేవా? వృత్తులు లేందే సమాజం లేదు. ఇందులో ఎవరు ఎక్కువా లేదు. తక్కువా లేదు. దయచేసి శాంతించండి"

నాయుడు గొంతు చించుకుంటూ ఇంకా ఏదో ఏదో చెప్పటానికి ప్రయత్నం చేస్తుంటే అడ్డు తగ లేదు స్వామినాయుడు.

"మీ ఉపన్యాసంతో నాకు పనిలేదు. మీరెన్ని చెప్పినా నాలో మార్పు తేలేరు మీరు సంతకం పెడతారా... పెట్టరా?" నిలదీసి అడిగేడు స్వామి నాయుడు.

వెంకయ్యనాయుడు కళ్ళవెంబడి నెత్తురులాంటి చుక్కలు రాల్తుంటే కొడుకుకేసి చూసి తల దిప్పుకున్నాడు. కనురెప్పల కొసల్నించి కారే నీటి చుక్కల్ని బయట పడకుండా దాచటాని కన్నట్టు తల పైకెత్తాడు.

అతనేం చెప్తాడా అన్నట్టు అంతా అతనికేసి చూస్తు ఉండిపోయారు అరనిమిషం నాయుడు పోత పోసిన బొమ్మలా అలాగే నిలబడి "అలాగే పెడతాను" తలూపేడు.

"నాయుడు గారూ!" కొన్ని వందల కంఠాలు ఒకేసారి లేచాయి నాయుడు అరచేతితో వారించేడు. మెల్లిగా కొడుకుకేసి తిరిగి "నీ ఆస్థి నీకప్పగించేముందు నీ ఆస్తి మరొకటుంది ఒక్క క్షణం" భారంగా అడుగువేస్తూ గ్రీకు శిల్పంలా లోపలికి అడుగుపెట్టాడు నాయుడు. అడుగుతీసి అడుగు భారంగావేస్తు వెళ్లాడు. అంతా ఆశ్చ ర్యంగా లోగిల్లోపలికి చూస్తూ ఉండిపోయారు. ఇంత జరుగుతున్నా నాయుడి కుటుంబ సభ్యులు ఎవరు బయటకు రాలేదు. నాయుడు లోపలకెళ్ళి తేబోయే ఆస్తి ఏమిటో అర్థంగాక తెల్లబోయి చూస్తూ ఉండిపోయారు.

నాయుడు బయటకొచ్చాడు. భారంగా బయట కొచ్చాడు. నాయుడ్ని చూసిన జనం బెదిరి పోయారు. దిగ్భ్రమ తర్వాత 'ఓరి బాబోయ్' ఓరి నాయనోయ్.

"అమ్మమ్మో"అనే మాటలు వాతావరణంలో ప్రతిధ్వనించేయి.

జనం బెదిరినట్టు ఒకడుగు వెనక్కి వేశారు. తమ కళ్ళని తామే నమ్మలేనట్టు చూశారు. క్షణం



కొనాల?

బజారు కెళుతోంది లక్ష్మి.

"ఏం కొనాలి?" అడిగింది పార్వతి.

"నిన్న మావారు టేబుల్‌లైటు తెచ్చారు చదువుకోడాని కేదయినా పుస్తకం కొందా మని" చెప్పింది లక్ష్మి.

–'ధాం' (హైదరాబాద్)

దిగ్భ్రమ తర్వాత ఆడవాళ్ళు గొల్లుమని ఏడుపులు లంకించుకున్నారు.

మగాళ్లు గుండెలరచేత పట్టుకున్నారు మరు క్షణం తమ కర్తవ్యం గుర్తుకొచ్చినట్టు ముందడుగువేసి స్వామి నాయుడ్ని చుట్టుముట్టబోయారు.

నాయుడి పంటికొసతో... దుఃఖం దిగమింగు కుంటు కళ్ళనించి రాలే రక్తపు చుక్కల్ని అదిమి పెట్టుకుంటూ... స్వామి నాయుడి మీదకు ఉరకబోయిన జనాన్ని తల విదలించి నిలబెట్టే శాడు.

రెండుచేతులూ... ఉక్కు స్తంభాల్లాంటి రెండు చేతులు స్వామి నాయుడుచేతిలో పచ్చటి పసుపు ముఖమంతా రాసుకుని, రూపాయంత బొట్టు పెట్టుకుని, కనకాంబరం రంగు పట్టుచీర కట్టుకుని మెడ తిరగని వస్తువులతో... చేతిని మెరిసే గాజుల్తో... ఉన్న స్వామినాయుడిభార్య శవం ఉంది.

నాయుడు మెల్లిగా అన్నాడు. ఏడుపును అదిమిపెడుతు తనలో తనే మాట్లాడుకుంటున్నట్టు అన్నాడు. అతని శరీరంలోంచి కాక ఆత్మలోంచి వస్తున్నట్టు నిర్వేదంగా...నిస్తేజంగా అన్నాడు.

"ఇదిగోరా... నీ ఆస్థి నీ రెండోపెళ్ళికి అడ్డులేకుండా వెళ్ళిపోయింది. నువ్వు ఒకప్పుడు నమ్మిన మతంతో ఈమె మెడలో తాళికట్టావు. ఈమె నీ ఆస్తి... కాలుస్తావో, పాడుస్తావో పూడ్చి... గోరి కడతావో నీ ఇష్టం... నీ యిష్టం...

నాయుడి మాటలు అలా చెబుతునే ఉన్నాడో పూర్తి అయ్యాయో తెలియదు. జనం అలా మంత్రముగ్ధుల్లా నిలబడిపోయేరు. ❋

